క్లుప్తంగా

ఖేడ్‌ను సందర్శించిన భగవంత్ మహారాజ్

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపూర్ శీర్వాల్కర్ గంగుమఠం పీఠాధిపతి గతామూర్తి భగవంత్ మహారాజ్ బుధవారం ఖేడ్ సందర్శించారు. పండరీపూర్ రుక్మిణి పాండురంగ భక్తులు ఆయన్ను ఇళ్లకు ఆహ్వానించి పాదపూజలు చేసి ఆశీస్సులు పొందారు. స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే మాతృమూర్తి పట్లోళ్ల గాళెమ్మ, సోదరుడైన డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జీవు లానాయక్, మాజీ ఎంపీటీసీ రాంచందర్‌నాయక్, నాయకులు ప్రకాష్‌పాటిల్, హన్మారెడ్డి, హన్మంతు తదితరులు ఆయన చేతుల మీదుగా తీర్థప్రసాదాలను స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



టోర్నీ ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, రాకేష్ షెట్కార్

నారాయణఖేడ్: మనూరు మండలంలోని దోసపల్లి గ్రామంలో బిరాదర్ దత్తు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని బుధవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో యువకులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఈ ప్రాంత క్రీడాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బిరాదర్ దత్తు, నాయకులు దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, దిగంబర్ రావుపాటిల్, సిద్దారెడ్డి, ఆకాశ్ రావు పాటిల్, అశోక్ పాటిల్, దత్తురెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వరప్ప, సాయి, అంజి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

జహీరాబాద్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాలు పంచుకోవాలని సత్వార్ పీఏసీఎస్ చైర్మన్ కె.చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని సత్వార్‌లో భువన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే పోటీల్లో మండలంలోని 24 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విన్నర్ జట్టుకు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు పారితోషికం అందజేస్తునట్లు తెలిపారు.కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్లు బండ్ల నర్సింహులు, రవి, సుధాకర్, అల్మాస్, సిద్దు, ప్రవీణ్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



గేటును ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని నాయీ బ్రాహ్మణుల శ్మశానవాటిక గేటు, గోడ సమస్య ఉందని దృష్టికి సంఘం సభ్యులు తీసుకురావడంతో స్పందించిన కార్పొరేటర్ సొంత నిధులతో శ్మశాన వాటికకు, దానికి గేటును ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు భరోసాకు యోగ్యమైన భూముల గుర్తింపు

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన రైతు భరోసా కోసం వ్యవసాయానికి యోగ్యమైన భూములను గుర్తించేందుకు గురువారం నుంచి గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు ఏఓ హరీశ్ పవార్ తెలిపారు. 16న కంగ్టి, తడ్కల్, రాంతీర్థ్, నాగన్‌పల్లి, జమ్గి(బీ), బోర్గి 17న సిద్దంగిర్గా, గాజుల్‌పాడ్, నాగుర్(కే), జమ్గి(కే) 18న ఎన్కెమూరి, భీంరా, బాన్సువాడ, చౌకన్‌పల్లి 19న దెగుల్‌వాడి, చాప్టా(కే), తుర్కవడ్‌గాం, దామర్‌గిద్దా, సుక్కల్ తీర్థ్, ముర్కుంజాల్, ఘన్‌పూర్ 20న చాప్టా(బీ), వల్మూర్, ఎంపల్లి గ్రామాల శివారు భూముల్లో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ఏఈఓలు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఏలు సర్వేలో పాల్గొనున్నట్లు తెలిపారు.

సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి, కనుమ పండుగలను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకొన్నారు. ప్రతి ఇంటి ముంగిట మహిళలు, యువతులు అందమైన ముగ్గులు వేశారు. చిన్నారులు, పెద్దలు గాలిపటాలను ఎగురవేశారు. ప్రతి ఇంటిలో తమ కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకొన్నారు.



జిన్నారం(పటాన్‌చెరు): విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు



నారాయణఖేడ్: చిత్రకారుడు గుండు శివకుమార్ వేసిన ముగ్గులు



సదాశివపేటలో పతంగులు ఎగురవేస్తున్న యువకులు




సంగారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు



సంగారెడ్డి పట్టణంలోని కల్పకుంటలో ఇంటి ముందు దేవత విగ్రహ రూపంలో ముగ్గు వేసిన



రామచంద్రాపురం(పటాన్ చెరు): కమ్యూనిటీ కాలనీలో గంగిరెద్దుల సందడి



హత్నూర మండలం దౌల్తాబాద్ లో ఓ ఇంటి ముందు ఆకర్షణీయంగా వేసిన ముగ్గు



సదాశివపేట పట్టంలోని శాస్త్రీ రోడ్డులో ముగ్గులు వేస్తున్నమహిళలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాయికోడ్(అందోల్): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 2005–2006బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. పాఠశాలలో కలుసుకొని సందడిచేశారు. ఆనాటి తమ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, ఉపాధ్యాయులు జగన్నాథం, రాజశేఖర్, సంగమేశ్వర్, బసప్ప, నాగన్న, నర్సింగ్ రావు, సునంద, అనిల్, వెంకటేశం, రాజేశ్, రవి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వినయ్, రాయికోడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సుభాష్ పాల్గొన్నారు.

గాలిపటాలు, క్యాలెండర్‌ల పంపిణీ

జోగిపేట(అందోల్): సంక్రాంతి పండుగను మూడు రోజులపాటు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఫొటోలతో కూడిన గాలిపటాలు, నూతన సంవత్సరం క్యాలెండర్‌లను పంపిణీ చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు డ్రమ్ములు

జహీరాబాద్: కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామం వద్ద 65వ జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నియంత్రణకు అవసరమైన డ్రమ్ములను సజ్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కె.ప్రసాద్‌రెడ్డి పోలీసులకు అందజేశారు. బుధవారం దిగ్వాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 60 డ్రమ్ములు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్, పార్టీ మండల అధ్యక్షుడు పి.రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాందాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

వట్‌పల్లి(అందోల్): యాసిడ్ తాగిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కేరూర్ గ్రామానికి చెందిన మంతూరి రామమ్మ(61) నాలుగు సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంల ఆమె మంగళవారం ఉదయం బాతురూంలోకి వెళ్లి క్లీనింగ్ యాసిడ్ తాగింది. దీంతో భర్త బీరప్ప వెంటనే జోగిపేట ఆసుపత్రికి తరలించాడు. అక్కడి నుంచి సంగారెడ్డి ఆసుపత్రికి, హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. మృతురాలి కుమారుడు శివరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రుడి నందివాహన సేవ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్న గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి నందివాహన సేవను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ఈవో శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో భక్తులు అర్చకులు నంది వాహనంపై భద్రకాళి సమేత వీరభద్రుని ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు



సంగారెడ్డి పట్టణంలో అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపు కార్యక్రమం

సంగారెడ్డి టౌన్: మకర సంక్రాంతి పండుగ పురస్కరించుకొని సంగారెడ్డిలో శ్రీమణికంఠ అయ్యప్ప ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో ఏనుగు అంబారీపై అయ్యప్పస్వామి స్వర్ణాభరణాలు ఊరేగింపు మహోత్సవం నిర్వహించారు. పట్టణంలోని సంజీవనగర్ హనుమాన్ మందిరంలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం డా.మహేశ్వరశర్మ సిద్ధాంతి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. పాతబస్టాండ్ శ్రీనవరత్నాలయ దేవస్థానం వరకు కేరళవాయిద్యాలు మహిళల కోలాటం అయ్యప్ప స్వాముల ఆటపాటలతో వైభవంగా జరిగిన ఊరేగింపు మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, గౌరవ అధ్యక్షుడు జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాథ రావ్,శ్రీశైలం గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జొన్న సాగుపై ఆసక్తి

కల్హేర్(నారాయణఖేడ్): యాసంగిలో జొన్న సాగు కోసం రైతులు ఆసక్తి కనబర్చారు. తక్కువ పెట్టుబడి, నీటి వాడకం తక్కువగా ఉండటంతో కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో రైతన్నలు జొన్న పంట వైపు మొగ్గు చూపారు. జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్ట్ నల్లవాగు ఆయకట్టు కింద 4,100 ఎకరాలు, బోరు బావుల వద్ద జొన్న సాగు చేపట్టారు. కొన్ని చోట్ల జొన్న కంకి దశలో ఉంది. పంట సంరక్షణ కోసం రైతులు నిరంతరం శ్రమిస్తున్నారు. కొన్ని చోట్ల కత్తెర పురుగు బెడద ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. కత్తెర పురుగు నివారణ కోసం మందులు పిచికారీ చేస్తున్నారు.

◆ 18న ఉచిత కంటి వైద్య శిబిరం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని షిర్డీసాయిబాబా అలయ ఆవరణలో 18న ఉదయం 10 గంటలకు లయన్స్ క్లబ్ సహకారంతో నాయీబ్రాహ్మణుల కోసం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా, స్థానిక బాధ్యులు నరేందర్, సత్యనారాయణ, సాయిలు, శంకర్ తెలిపారు. శిబిరంలో కంటికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు జీరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

◆ బసవక్రాంతి దినోత్సవం

నారాయణఖేడ్: బసవేశ్వరుడి ఆలోచనా విధానాలతో ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ సూచించారు. మంగళవారం బసవక్రాంతి దినోత్సవం పురస్కరించుకొని ఖేడ్ బసవేశ్వర చౌక్ వద్ద జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడారు. బసవేశ్వరుడు సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

◆ రహదారి పక్కన రసాయన వ్యర్థాలు పారబోత

జిన్నారం(పటాన్‌చెరు): మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామ శివారులో రహదారి పక్కనే గుర్తుతెలియని వ్యక్తులు పరిశ్రమల వ్యర్థాలను పారబోశారు. దీంతో ఆ దారి గుండా వెళ్లె రైతులు, వాహనదారులు ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు బాధ్యులైన పరిశ్రమలపై అధికారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యాల తీరుపై పారిశ్రామిక వాడ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ విశ్వకర్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ ఆవిష్కరించారు. విశ్వకర్మల సంక్షేమానికి సంఘం ద్వారా చేస్తున్న కృషిని ప్రశంసించారు. సంఘం బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవీంద్ర చారి, సత్యనారాయణ చారి, దామోదర్ చారి, అశోక్ చారి, లక్ష్మణ్‌చారి, జయపాల్‌రెడ్డి, మల్లేశ్, వినోద్, తదితరలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఉత్తమ ముగ్గులకు బహుమతులు ప్రదానం చేశారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, హమాలీకాలనీ, శాంతినగర్, రాంనగర్, గాంధీనగర్, రాచన్నపేటతో పాటు పలు కాలనీల్లో మహిళలు వేసిన ముగ్గులను బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమంగా ఎంపికయిన ముగ్గులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జి.భాస్కర్, పూల సంతోష్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంప్రదాయాలకు మూలం



కైట్ ఫెస్టివల్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



పతంగి ఎగరవేస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: సంక్రాంతి పండుగ తెలుగు సంప్రదాయాలకు మూలం అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని చిట్కుల్‌లో కుమారిడితో కలిసి పతంగులను ఎగుర వేశారు. అదేవిధంగా ఎండీఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ ఆధ్వర్యంలో పటాన్ చెరు మైత్రి మైదానంలో కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

గ్రామాలలో ముగిసిన క్రికెట్ పోటీలు



హత్నూరలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలంలో సంక్రాంతి సందర్భంగా పలు గ్రామాలలో ఐదు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లు బుధవారం ముగిశాయి. హత్నూర క్రికెట్ లీగ్ 3 టోర్నమెంట్లో గ్రామానికి చెందిన ఎనిమిది క్రికెట్ టీమ్‌లు పాల్గొన్నాయి. సెమీఫైనల్, ఫైనల్ క్రీడా పోటీల్లో స్టార్స్ క్రికెట్ జట్టు విజేతగా నిలవగా, చాలెంజర్స్ జట్టు రన్నరప్‌గా మిగిలింది. విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వీరస్వామిగౌడ్, వెంకటేశం, గ్రామస్తులు దాసుగారి కిష్టయ్య, మాణిక్య రెడ్డి కిష్టయ్య, నరేందర్, వరుణ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాసాల, చింతలచెరువు, పన్యాల, నస్తీపూర్ తదితర గ్రామాలలో సంక్రాంతి సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టులు అక్రమం



గాలిపటాలు ఎగరవేస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం మండలంలో బీఆర్‌ఎస్ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. వెంకటేశం గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పోలీస్ స్టేషన్లోనే నిరసన వ్యక్తం చేస్తూ గాలిపటాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ నియంతృత్వ పాలన కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టుల పై ఉన్న శ్రద్ధ ప్రజా పాలనపై లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజేష్, నర్సింహరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నీలం మోహన్, శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, నిఖిల్ గౌడ్, మల్లేశ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



నారాయణఖేడ్: పోలీస్‌స్టేషన్‌లో నాయకులు



పటాన్‌చెరు టౌన్: ముందస్తు అరెస్ట్ అయిన బీఆర్‌ఎస్ శ్రేణులు

నారాయణఖేడ్: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టుకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతారన్న అనుమానంతో మంగళవారం తాజా మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, మండల పరిషత్ మాజీ కో–ఆప్షన్ సభ్యులు నవాబ్, నాయకులు సంగప్ప, చెన్‌బసప్ప, మల్గొండను ఖేడ్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఉదయం అరెస్టు చేసి సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేయడం సరికాదు...

పటాన్‌చెరు టౌన్: ప్రశ్నిస్తే అరెస్టు చేయడం సరికాదని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు నేపథ్యంలో మంగళవారం పటాన్‌చెరు పోలీసులు కార్పొరేటర్ కుమార్‌యాదవ్ తో పాటు బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ రోజున పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజల తరఫున బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

అధ్వానంగా పట్టణ రోడ్లు



గ్రామీణ బ్యాంక్ రోడ్డులో ప్రమాదకరంగా గుంత

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని పలు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. మున్సిపల్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడంలేదు. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లను వాటర్ పైపులైన్ తదితర కారణాల వల్ల తవ్వడంతో పంట కాలువల మాదిరిగా తయారయ్యాయి. పట్టణంలోని ప్రధాన బ్లాక్ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్లే రోడ్డు సైతం కోతలకు గురైంది. పట్టణంలోని గ్రామీణ బ్యాంక్(ఓల్డ్ కేత్ ఎత్నిక్) ముందున్న రోడ్డుపై పెద్ద గుంత పడింది. ఇలా పట్టణంలో పలు ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.